11

# క్రీస్తునందలి నూతన జీవితము, 1

## కొలొస్సయులకు 3:1-4

### పైనున్నవాటినే వెదుకుట (3:1-4)

**[1]మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే పైనున్నవాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు. [2]పైనున్నవాటిమీదనే గాని, భూసంబంధమైనవాటి మీద మనస్సు పెట్టుకొనకుడి; [3]ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది. [4]మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచబడుదురు.**

**"కాబట్టి మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే" (3:1ఎ)**

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికలో, ఆయన సంఘములకు రచించిన ఇతర అత్యధిక పత్రికలలో వలెనే, పౌలు మొదట ఒక పునాది వేసి, సిద్ధాంతపరమైన ఆలోచనల ఆధారంగా దానిపై నిర్మింపబడవలసిన మాదిరి జీవితమును ఆ తరువాత వర్ణించాడు. పౌలు ఈ నిర్మాణక్రమమును 3:1లో వాడుచుండెనని **"కాబట్టి"** అను పదము సూచించుచున్నది.[1]

ఆయన రచించిన పత్రికలలో దీనికి ముందరి విభాగమునకు (1:12-2:23) తన పత్రికలోని తరువాత ప్రధాన భాగమునకును (3:5-4:6) మధ్య కొలొస్సయులకు 3:1-4 పౌలుకు ఒక స్థిత్యంతరముగా పనికివచ్చుచున్నది. తత్త్వశాస్త్రము మరియు అబద్ధ బోధల గూర్చిన తన చర్చను ఆయన 2:8-23లో సంపూర్తి చేసిన తరువాత క్రీస్తు నందలి నూతన జీవితము యొక్క అభివృద్ధి మరియు దాని లక్షణముల గూర్చిన చర్చను మొదలుపెట్టాడు. కొలొస్సయులు లోకము యొక్క తత్త్వశాస్త్రమును మరియు మూలపాఠములను ఎందుకు సేవించకూడదో 2:20-23లో వివరించిన తరువాత, క్రైస్తవులు ఏమి చేయవలెనో మరియు వారు ఏమి చేయకూడదోనని వారికి తెలియజెప్పుచున్న దానిని సమర్థించుకొనుటకు 3:1-14లో నిశ్చయాత్మకమును మరియు వ్యతిరేకార్థకమునైన హేతువులను విశదంగా వివరించుచున్నాడు.

పౌలు ఒక విభాగమును "కాబట్టి"తో మొదలు పెట్టినప్పుడెల్లా, ఆయన అంతకు మునుపు చెప్పిన దాని గూర్చి ప్రస్తావించుచుండెనని అర్థమగుచున్నది. కొలొస్సీలోని క్రైస్తవులు బాప్తిస్మములో క్రీస్తుతో కూడ మృతిచెంది (2:20) మరలా లేపబడ్డారు (2:12, 13). బాప్తిస్మము పొందుట ద్వారా, వారు యేసు మరణమును, పాతిపెట్టబడుటను, మరియు ఆయన పునరుత్థానములో పాలుపంచుకొనుచు, తద్వారా ఆధ్యాత్మికముగా సజీవులుగా చేయబడుచుండిరి. క్రీస్తుతో కూడ పొందు ఈ అనుభవమునకు వెనువెంట కలుగవలసిన పరివర్తనను చర్చించగలుగునట్లు పౌలు ఈ భావ చింతనకు మళ్లాడు.

2:20లో వలెనే, 1వ వచనంలో "అయితే"తో అభివ్యక్తము చేయబడిన నియమబద్ధమైన

ఉపవాక్యము, కొలొస్సయులు క్రీస్తుతో కూడాలేపబడలేదను అనుమానము గల భావమును తెలియజేయుటలేదు. ముఖ్యంగా, బాప్తిస్మములో క్రీస్తుతో కూడ వారు లేపబడినప్పుడు మొదలైన నూతన జీవితములోనే వారు కొనసాగుచుండవలెనని పౌలు చేయుచున్న సవాలుకు అది మూలాధారముగా నిలుచుచున్నది. "అయితే" అను మాటను "గనుక" అని అనువదింపబడవచ్చును. ఈ వక్కాణింపును చేసిన తరువాత, వారు పైనున్న వాటినే వెదకుచుండవలెనని పౌలు వారికి ఆజ్ఞాపించాడు. యేసుతో కూడ నూతన జీవితములోనికి ప్రవేశించిన తరువాత, వారు "పైనున్న వాటి" నిమిత్తము జీవించవలసినవారై యుండిరి.

**క్రీస్తుతో కూడ లేపబడక మునుపు,** వీరు వ్యక్తిగతముగా ఆయనతో కూడ పాతిపెట్టబడినందునుబట్టి, అది వారిని పాపమునకును (రోమీయులకు 6:1-6; 3:3, 4బి లోని "ఆయనతో కూడ"పై వ్రాయబడియున్న చర్చను చూడండి) లోకము చేత కల్పింపబడిన నిబంధనలకును మృతిచెందినవారిగా చేయవలసియుండెను. పౌలు రెండు పూర్వ భావనలు తెలియజేసాడు: వారు క్రీస్తుతో కూడ మృతులును, ఆయనతో కూడ లేపబడినవారును అయ్యారు (కొలొస్సయులకు 2:12, 20). ఆయనతో కూడ మృతిచెందుట ద్వారా, వారు జీవితమునకు సంబంధించిన ప్రాపంచిక జ్ఞానము మరియు ఐహిక దృష్టికోణము నుండి తమ్మునుతాము తెగదెంపులు చేసికొన్నారు.

వారి నూతన దృష్టికేంద్రము క్రీస్తే అయి యుండెను, గనుక వారు ఆయన నివాసముంటున్న పరలోక వాస్తవములనే వెదకవలసినవారై యుండిరి. వారి తెరిచూపంతా దిగువ దిశగా ఈ లోక మూలపాఠముల వైపు కాదు గాని ఊర్ధ్వముఖముగా క్రీస్తు మరియు ఆయన ఆజ్ఞల మీదనే కేంద్రీకరింపబడవలెను. వారి మనస్సులను వారు మరొక వైపునకు యాంత్రికంగా మళ్లించలేరు; దాని నిమిత్తము వారు ప్రయాసపడవలసియుండును. వారి ఆలోచనలకు నూతన అభిరుచులు అధిష్టానము వహించవలెను.

ఒకడు బాప్తిస్మము పొందునప్పుడు వానిలో కలుగు పరివర్తనమును జే. బి. లైట్‌ఫుట్ ఇలా వర్ణించాడు:

> బాప్తిస్మములో ఇమిడియున్న మార్పు యథార్థముగా అనుభవింపబడినట్లయితే, అట్టి మార్పు వాని సంపూర్తి స్వభావము లోనికి వ్యాపించవలెను. అది వాని ప్రయోగాత్మకమైన ప్రవర్తనను మాత్రమే కాదు, కానీ వాని మేధా సంబంధమైన భావనలను సహితము ప్రభావితము చేయును. అట్టి పరిస్థితి వాడు ఒక నూతన ఉనికి గల పరిధి లోనికి ప్రవేశించుట కంటె తక్కువైనదేమీ కాదు. వాడు ఇహమునుండి పరలోకమునకు మార్చబడ్డాడు; గనుక వాని దృష్టికోణము సహితము ఇప్పుడు సవరింపబడినదగును, వాని విచక్షణా ప్రమాణస్థాయి మొత్తానికే మారిపోతుంది. భౌతిక పదార్థము వానికి ఇక మీదట గొప్ప శత్రువేమీ కాదు; దాని గూర్చిన వాని అభిప్రాయము బొత్తిగా తటస్థమైనదై యుండును. వైరాగ్య నిబంధనలు, ఆచారకర్మకాండల గూర్చిన ఆజ్ఞలు, అవి ఎంతటి ప్రభావశాలులైనప్పటికిని, ఇప్పుడు వాని దృష్టిలో వాటికి ఎటువంటి విలువైనను లేదు. ఈ విషయాలన్నీ కూడ ఐహికమైనవే, భూసంబంధమైనవే. భౌతిక పదార్థము, తాత్కాలికమైనవై, ప్రాపంచికమైనవన్నీ, ఇప్పుడు నైతికమైనవి, నిత్యమైనవి, మరియు పరలోక సంబంధమైన విషయాలకు చోటిచ్చాయి.[2]

"లేపబడితిరి" అను మాటలకు సంబంధించిన గ్రీకు పదము 2:12లో నున్న *sunegeirō* "లేచితిరి" అని అనువదింపబడిన మాటకు సంబంధించిన అదే పదమై యున్నది. క్రియా "కాల(బోధక)ము" సంపూర్తి చేయబడిన చర్యను సూచించుచున్నది. "పాటింపబడవలసిన

షరతు నెరవేర్చబడినదని గ్రీకు భాషలోని నియమబద్ధమైన ఉపవాక్యము యొక్క రూపము (*ei*) ధ్వనించుచున్నది"[3] వారు "క్రీస్తుతో కూడ" లేపబడినందు వలన, కొలొస్సయులు వారి ఆలోచనా ధోరణిని దారి మళ్లించి, వారి మనస్సులను ఆయన మీదనే కేంద్రీకరించుచు, వారికి ఆయనతో గల సన్నిహిత సంబంధమును పెంచిపోషించుకొనుచుండవలెను.

సహోదరులు ఇక మీదట లౌకిక విషయములను వెదకుచుండకూడదు (2:20). ఇప్పుడు వారు పరలోక సంబంధమైన ప్రశస్తమైన విషయములను వెదకవలసి యున్నది (3:1). లోకమునకు భిన్న దిశగా చూచుచు, వారి చూపునంతటిని యేసు మీదనే కేంద్రీకరించుట ద్వారా (హెబ్రీయులకు 12:1, 2) "శరీరేచ్ఛా నిగ్రహమునకు" సంబంధించిన సమస్యను వారు పరిష్కరించుకొనవలెను (2:23). వారు క్రీస్తు స్వభావమును ధరించుకొనగలుగునట్లు, జీవితము గూర్చి ఒక నూతన దృక్పథమును, మహిమపర్చబడిన క్రీస్తుకే అంకితమై యున్న దృష్టికోణమును అభివృద్ధిచేసికొనవలసి యున్నది.

### "పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు" (3:1బి)

క్రీస్తుతో కూడ లేపబడినందుకు ఫలితంగా, కొలొస్సయులు వారి మనస్సులను ఆధ్యాత్మిక అంశముల వైపు మళ్లించవలసి యున్నారు. వెదకుచుండుడి అని అనువదించిన *zēteite* అను పదము కొనసాగుచునే యుండవలసిన చర్య గూర్చిన ఒక ఆజ్ఞ ఇవ్వబడినట్లు తెలియజెప్పుచున్నది. అనగా కనుగొనగలుగునట్లు వెదకుచునే, అన్వేషించుచునే, పాటుపడుచునే యుండుము అని దాని అర్థమై యున్నది. పౌలు వ్రాయుచున్న పత్రిక గ్రహీతలు పరలోక స్వభావమును కనుగొనుట మాత్రమే కాదు, కానీ దానిని పొందవలసిన అగత్యము కూడ ఉండినది. వారు విశ్వాసములో నిలిచి యుండవలసిన విధములోనే (1:23), పైనున్న వాటినే వెదుకుటలో కూడ నిమగ్నమై యుండవలెను.

"పైనున్నవాటినే" అని అనువదింపబడిన *anō* అను పదము యోహాను 8:23లోను, గలతీయులకు 4:26లోను, మరియు ఫిలిప్పీయులకు 3:14లోను ఇదే విధముగా వాడబడినది. "పైనున్న విషయములు" అను పదజాలము క్రొత్త నిబంధనలో ఇచ్చట గాక మరెచ్చటను కనిపించదు. వాటి సంబంధమును సరైనరీతిలో చూడగలుగునట్లు, కొలొస్సయులు వారి దృష్టిని ఈ జీవిత సంబంధమైన మలినముపై నుండి నూతన జీవితము వైపుగా మళ్లించి దానిని కార్యశీలకముగా కొనసాగించవలసి యున్నది. అలాగని, నూతన విశ్వాసులుగా, వారు ఐహిక విషయముల గూర్చిన బాధ్యతను బొత్తిగా విస్మరించి, ఆధ్యాత్మికమైన అంశముల గూర్చి మాత్రమే చింతించుచుండవలెనని దీని అర్థము కాదు; కానీ వారి ప్రస్తుత నూతన జీవితమును దైవికమైన దృక్కోణంలో దృష్టించవలసి యున్నదని అర్థము.

క్రైస్తవులమైన మనము, మన ప్రాథాన్యములను అనుసరించుటకు నేర్చుకొనవలెను. పరలోక విషయములను వెదకలేంతగా ప్రాపంచ విషయములలోనే చిక్కుకొనిపోయినవారము కాకూడదు సరికదా, ప్రాపంచిక బాధ్యతలు సరైన విధంగా సరిచూచుకోలేనంతగా పరలోకమునకు వెళ్లవలెనను విషయమే అత్యంత ప్రాధాన్యమైనదన్నట్లు దానిలోనే నిమగ్నమైనవారము కాకూడదు. మన ప్రాపంచిక బాధ్యతలకును దైవభక్తి విషయమైన లక్ష్యాలకును గల సంబంధమును సరిచేసికొనుట ద్వారా ఈ రెండింటి యొక్క సరైన

సమానీకరణము సాధించబడగలదు.

మనము యేసును శారీరకముగా చూడలేము, కానీ ఆయన తండ్రి కుడి పార్శ్వమునకు ఆరోహణమై వెళ్లాడని మనము అనుభవంలోనికి తెచ్చుకొనగలము. పరలోక సంస్థితిలో, యేసు పవిత్రమును పాపరహితమునైన విషయములలో మాత్రమే ఆవరింపబడి యున్నాడు. ఆయనను వెంబడించుచున్నవారముగా, మనుము ఆయనతోను ప్రస్తుతము ఆయనను ఆవరించియున్న పరిశుద్ధతతోను గుర్తింపబడుచున్నామని మనలను మనము భావించుకొనవలెను.

పౌలు కొలొస్సీ పత్రిక వ్రాయుచుండిన సమయంలో, యేసు, ఆయన ఇహమునకేతెంచక పూర్వము నివాసముండిన చోట, పరలోకములో ఉన్నాడు. తండ్రి కుడి పార్శ్వమునుండి, అత్యున్నతమైన గౌరవార్హమైన చోటులో ఆశీనుడై అక్కడ నుండి పరిపాలించుటకు ఆయన పునరుత్థానుడైన నలువది దినముల తరువాత యేసు ఇహము నుండి పరలోకమునకు ఆరోహణుడై వెళ్లాడు (అపొస్తలుల కార్యములు 1:3, 9–11). ఇంత గొప్ప అధికారముగల చోటు ఇతరమై మరి యే ప్రాణికైనను, దేవదూతలకు సహితము, ఇయ్యబడలేదు (హెబ్రీయులకు 1:13). దేవుని కుడి పార్శ్వమున జరుగు యేసు పట్టాభిషేకము గూర్చి దావీదు ముందుగానే ప్రవచించాడు (కీర్తనలు 110:1), మరియు యేసు ఈ లేఖనమును తనకే వర్తింపజేసికొన్నాడు (మత్తయి 22:44; 26:64; మార్కు 12:36; లూకా 20:41–44). యేసు ఆరోహణమైన తరువాత, ఆయన తండ్రియైన దేవుని కుడిపార్శ్వమున కూర్చుండుట నిర్ధారింపబడిన ఒక వాస్తవముగా పేర్కొనబడినది.[4]

మృత్యువునోడించిన యేసు పునరుత్థానుడై, పరలోకమునకు ఆరోహణుడై, తండ్రియైన దేవుని కుడిపార్శ్వమున ఆశీనుడైనప్పుడు, సమస్తము, "దేవదూతలు, అధికారులు మరియు శక్తులతో సహా" సకలము (1 పేతురు 3:22) ఆయన పాదముల క్రింద ఉంచబడినది (ఎఫెసీయులకు 1:20–22). ఆనాటినుండి ఆయన రాజ్యము (కొలొస్సయులకు 1:13) మరియు ఆయన యేలుబడి ఉన్నవి. ఇప్పుడు ఆయన తండ్రిని మినహాయించి ప్రతి ఒక్కరిని ప్రతి విషయమును నియంత్రించుచు యేలుచున్నాడు. ఆయన తిరిగి వచ్చు పర్యాంతము ఆయన ఏలుచునే యుండును, అప్పుడు ఆయన తన రాజ్యమును తండ్రికి అప్పగించును (మత్తయి 13:41–44; 1 కొరింథీయులకు 15:23–28). ఆయన తిరిగి వచ్చినప్పుడు, రక్షింపబడినవారు – అనగా మృతులలో నుండి లేపబడినవారు మరియు సజీవులైయున్నవారు – ఆయనను మధ్యాకాశములో కలిసికొని ఆయనతో కూడ పరలోకములో ఉందురు (1 థెస్సలొనీకయులకు 4:15–17).

## "పైనున్నవాటి మీదనేగాని, భూసంబంధమైనవాటి మీద మనస్సు పెట్టుకొనకుడి" (3:2)

కొలొస్సయులు వారి మనస్సును యేసు నివసించుచుండు కలుషితముకాని రాజ్యముపై కేంద్రీకరించి యుంచవలసినవారై యుండిరి. వారి మనోచిత్తమును ఐహిక విచారములపై ఉంచవలెనో లేక పరలోక విషయములపై ఉంచవలెనో వారు ఎన్నుకొనవలసి యుండినది. పౌలు ఆయా స్థలములలో కనుపర్చబడవలసి యుండిన జీవిత విధానము గూర్చి చింతించుచుండినంతగా ఆయా స్థలముల గూర్చి కంగారుచెందలేదు. క్షణభంగురము, అల్పమైనవైనవి మరియు పాపిష్ఠి **ఇహలోక సంబంధమైన విషయములు** మరియు పరిశుద్ధము,

నిలిచియుండునవి, నిత్యమైనవి మరియు **పైనున్న విషయములు** మధ్య తారతమ్యమున్నది.

మనస్సు పెట్టుకొనుడి అను పదజాలము ఒక్క గ్రీకు విధివివాహితమైన పదము, *phroneite* యొక్క అనువాదమై యున్నది. ఈ సందర్భము మరియు ఇతర సందర్భములలో (రోమీయులకు 12:16; ఫిలిప్పీయులకు 3:19), "ఏదో ఒక విషయము గూర్చి శ్రద్ధాపూర్వకముగా ఆలోచించుట, ఒకరి మనస్సు వినిపించుట, ఉద్దేశించుట" అనునది ఈ పదము యొక్క అర్థమై యున్నది.[5]

"మీ మనస్సు పెట్టుకొనుడి" అను KJV అనువాదము భావోద్రేకములను అతిగా నొక్కివక్కాణించుచున్నది. పౌలు కొలొస్సయుల మనస్తత్వము గూర్చి ఆందోళనచెందుచున్నవాడై యుండెను. వారు పరలోకమునకు వెళ్లుట గూర్చి వెదకుటను మించినది చేయవలసి యుండినది; పరలోక సంబంధమైన దైవభక్తిగల స్వభావము వారి ఆలోచనల్లోని ప్రధానాంశమై యుండవలెను. "పై నున్నవి" అనగా భౌతిక విశ్వమును సూచించుచుండలేదని కొలొస్సయులు అర్థంచేసికొన్నారని రూఢిపర్చుకొనునట్లు, ఆయన "అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు" (3:1) అని విశేషణార్థతను కలిగించుచున్నాడు.

"భూమి" పాపము ఏలుచుండు రంగస్థలమై యున్నది, అయితే "పై నున్న విషయములు" పరిశుద్ధత సర్వోచ్ఛమైనదై యున్న ఉనికి కలిగియున్నవి. మనము క్రైస్తవులముగా జీవించు విధానము మన మనో భావముల కేంద్రమైయున్నదో అను విషయము చేత నిర్ధారింపబడును. మనము మన మనస్సును ఈ లోక విషయములపై కేంద్రీకరించినట్లయితే, మనము ఐహికమైన మనస్సుగలవారమై యుండి ఇహలోక సంబంధులవలె జీవించుచుందుము. మనము పరలోక విషయములపై మన మనస్సును కేంద్రీకరించినట్లయితే, మనము దైవికమైన స్వభావమును ధరించి ఇహలోక జీవితములో ప్రాపంచిక వివరాల చేత నియంత్రించబడము. కొలొస్సయుల వలెనే, మన మనస్సులను నియంత్రించుకొనుచు, ఆధ్యాత్మికము కాని విషయములను మినహాయించుటకు ప్రయత్నించుచు, ఈ లోక జీవితమునకు సంబంధించిన విషయములను పరిశీలించుచు, మన సావధానమంతటిని ఆధ్యాత్మికమైన విషయములకు అంకితము చేసికొనుట మన కర్తవ్యమై యున్నది.

మన ఆలోచనల నుండి పాపిష్ఠి అలవాట్లు మినహాయింపవలసి యుండగా, ఇది చాలదు. ఒకని మనస్సు దుర్వ్యసనములు లేనిదైయున్నదంటే, అది సద్గుణముల చేత నిండియున్నదని అర్థము కాదు. ఆధ్యాత్మిక ఆలోచనలు కలిగి జీవించుచుండుట ద్వారా, వ్యతిరేకార్థక అభ్యాసములను తొలగించుకొనవచ్చును. చెడును నిర్మూలించుటకు సద్విషయములు మీద మన ధ్యానమును నిలిపియుంచుట ఒక చక్కని మార్గమై యున్నది. పౌలు ఈ సూత్రమును రోమీయులకు 12:21; 13:14; 2 కొరింథీయులకు 3:18; గలతీయులకు 5:16లో నివేదించి యున్నాడు.

ఫిలిప్పీయులకు వ్రాస్తూ ఎవరైతే భూసంబంధమైన మనస్సును కలిగియున్నారో వారు సిలువకు శత్రువులని పౌలు సూచించాడు (ఫిలిప్పీయులకు 3:18, 19). అదే పత్రికలో వేటిపై వారు మనస్సునుంచవలెనో వాటిని గూర్చిన పట్టికను ఇచ్చాడు (ఫిలిప్పీయులకు 4:8). పైనున్న వాటికి భిన్నంగ వున్న అనేకమైన భూసంబంధమైన వాటిని మరియు సాతాను క్రియలను యాకోబు పట్టిక చేసాడు (యాకోబు 3:14-18).

**“ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడియున్నది” (3:3)**

కొలొస్సయులు ఒక ప్రక్క మృతిచెందియున్నారు, మరొక ప్రక్క సజీవులై యున్నారు (2:13, 20). వారు మృతిపొందియున్నారు (*apothnēskō*). ఈ క్రియా పదము పూర్తిచేయబడినదియు కచ్చితమైనదై యున్న చర్యను వ్యక్తము చేయుచున్నది, కానీ వారు ఆధ్యాత్మికముగా మృతిచెంది యుండిరని గ్రహించుటకు బహుశా ఈ సహోదరులలో కొందరికి కష్టమైయుండవచ్చును. అది వారి మనస్సుల్లో చెక్కబడునట్లును వారు మృతిచెందుట వలన పరిణామములను నొక్కివక్కాణించుటకును ఇదే భావనను పౌలు పునరుక్తము చేసాడు. ‘[‘మీ జీవములు”కు బదులుగా, “మీ (బహువచనము) జీవము” (ఏకవచనము)] ఒక బహువచనమును ఒక ఏక వచనముతో వాడుట గ్రీకు భాషలో సర్వసాధారణమై సంగతైయున్నది.[6] ఈ క్రైస్తవులు క్రీస్తునందలి నూతన జీవమును పంచుకొనిరి.

వారిని క్రీస్తు నుండి వేరు చేసిన (1:21), అది వరకటి జీవిత విధానములోని దుర్మార్గపు పనులకు వారు ఆధ్యాత్మికముగా మృతిపొంది యుండినప్పటికిని, ఆయన రక్తము చేత సమాధానపరచబడినవారై, వారు క్రీస్తుతో కలిగియుండిన నూతన సంబంధములో కొలొస్సయులు సజీవులై యుండిరి. విల్యమ్ హెండ్రక్సన్ ఇలా వ్రాయుచున్నాడు, ఇదివరకే వివరింపబడిన భావము ప్రకారము (2:11, 12 చూడుము) కొలొస్సయులు మృతిచెందినవారై పాతిపెట్టబడియుండిరి. గనుక యికను జీవించువారు కాదు కానీ వారిలో జీవించుచున్న క్రీస్తే. పాపము యేలుబడి చేయుచుండిన వారి జీవితములలోని ప్రాచీన స్వభావమునకును లోకమునకును వారు మృతిచెందియున్నారు.”[7]

వారు బాప్తిస్మమను చర్యలో మృతిపొందిరి. 2:12లో ఈ సత్యము దాగియున్నట్లు ధ్వనించుచున్నది మరియు అది రోమీయులకు 6వ అధ్యాయంలో స్పష్టంగా తెలియజెప్పబడియున్నది. “పాపము విషయమై చనిపోయిన మనము ఇక మీదట ఏలాగు దానిలో జీవించుదుము?” అని పౌలు ప్రశ్నించుచున్నాడు (2బి వచనము). ఈ ప్రశ్నకు ఆయన, “మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి” అని సమాధానమిచ్చుచున్నాడు (4ఎ వచనము). కొలొస్సయిలోని క్రైస్తవులు ఇప్పుడు మృతిచెంది యున్నారు, అనగా, గత జీవితములోని ప్రాపంచిక విషయములకు వారు మృతిచెంది యున్నారు. బాప్తిస్మము పొందక మునుపు, వారి జీవిత విధానమునుబట్టి వారు దేవుని విషయములో మృతిచెందియుండిరి. ఇప్పుడు యేసు మరణముతో గల గుర్తింపు మూలమున వారి గతమునకు వారు చచ్చినవారై యున్నారు. వారు క్రీస్తుతో కూడ, దేవుని యందు ప్రవేశించిన నూతన ప్రదేశము, ఈ జీవితములో ఎదురయ్యే చెడు తుఫానుల నుండి కాపాడకొనగలుగుటకు ఒక ఆశ్రయమును సమకూర్చినది.

దాచబడియున్నది (*kruptō*) అను పదము కొనసాగుచుండు ఫలితముగల పూర్తిచేయబడిన ఒక చర్యను సూచించుచున్నది. వారి జీవితములు క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడి యుండినవి గనుక అవి ఇక మీదట కూడ దాచబడే యుండినవై యుండును. వారు “క్రీస్తుతో కూడ దేవుని యందుండిరి” ఏలయనగా వారు క్రీస్తునందుండిరి (2 కొరింథీయులకు 5:17) మరియు క్రీస్తు దేవునియందున్నాడు (యోహాను 10:38; 14:10, 11, 20; 17:21). ఒక దృష్టికోణంలో, లోకము వారిని చూడలేదు ఏలయనగా

వారు క్రీస్తును ధరించి యుండిరి (గలతీయులకు 3:27). సహజంగానే, వారు "దాటబడియుండిరి" అను వాస్తవమునుబట్టి లోకము వారిని చూడలేకపోయినదని అర్థము కాదు; లోకము వారు ధరించియుండిన క్రీస్తును, చూచినది.

ఈ క్రైస్తవులు "లోకమునకు వెలుగై యుండిరి. కొండ మీద నుండు పట్టణము మరుగైయుండనేరదు" (మత్తయి 5:14). వారు లోకములో నుండి సంపూర్తిగా దాచబడియున్నట్లయితే, వారు లోకమునకు వెలుగైయుండజాలరు. లోకమునకు వారు వివాహమహోత్సవ వస్త్రమును, అనగా క్రీస్తును, ధరించియున్నవారిగా కనబడవలసిన అవసరముండినది (మత్తయి 22:11, 12; గలతీయులకు 3:27). ఆయనే వెలుగై యున్నాడు (యోహాను 8:12), వారు ఆ వెలుగుతో సంపూర్తిగా కమ్ముకొనబడినవారై యుండిరి. వారు యిక మీదట చీకటియై యుండలేదు కానీ ప్రభువునందలి వెలుగై యుండి (ఎఫెసీయులకు 5:8), లోకములో జ్యోతుల వలె వెలుగుచుండిరి (ఫిలిప్పీయులకు 2:15బి).

"క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడినవారై," వారు దేవుని కాపుదల క్రింద ఉండిరి (1 కొరింథీయులకు 10:13) గనుక లోకము మరులుగొలుపు అలవాట్ల నుండి దాచబడి యుండిరి. మనము దాగుకొనుటకు దేవుడు ఒక అనువైన చోటైయున్నాడనియు (కీర్తనలు 17:8; 31:20; 64:2), ప్రజలకు ఒక ఆశ్రయదుర్గమైయున్నాడనియు (కీర్తనలు 61:2, 3). ఒక అవగాహన పాత నిబంధన నివేదించుచున్నది. సుక్షేమకరమైన ఈ ఆశ్రయదుర్గములో, గంధరగోళంగా నుండు పాపిష్ఠి కేకలు వినబడకుండ, ప్రాపంచిక హానికి అందనంతటి దూరంలో వారు అతి భద్రముగా నుండిరి. వారు క్రీస్తుతో కూడ, వారి కాపుకర్తయైనవానితో కూడ నుండిరి, గనుక దేవునితో, అనగా ఆశ్రయ దుర్గమును కోటయునై యుండినవానితో నుండిరి.

కొలొస్సయులు వారు దాగుకొనగలిగిన చోట క్షేమకరంగా దాగియుండినంత వరకు, వారిని బలవంతము చేయు సాతాను శక్తులు వారిని జయించి చెరగా కొనిపోజాలవు (1 యోహాను 3:6, 9; 1 పేతురు 1:23తో పోల్చుము). యేసు దుష్టశక్తులను జయించియున్నాడు (కొలొస్సయులకు 2:15), గనుక వారు కూడ దుష్టశక్తులను జయించునట్లు ఆయన వారికి సహాయము చేసియున్నాడు (1 యోహాను 4:4). వారు జయించినవానితో కూడ క్షేమంగా నిలిచియుండినట్లయితే, వారు సహితము జయశీలులై యుందురు. వారిని క్రీస్తు నుండి, వారికి దాగుచోటైయుండిన వాని నుండి మరులుగొల్పుట ద్వారా వారిని ఎవరైనను లేక ఏదైనను చెరగా కొనిపోకుండునట్లు వారు అప్రమత్తులై యుండవలసి యుండినది (కొలొస్సయులకు 2:8).

పౌలు "క్రీస్తు తో" (*sun ... Christō*) అను పదజాలమును ఈ ఉద్దేశముతో ఇచ్చట మాత్రమే ఉపయోగించాడు. పౌలు "క్రీస్తుతో" అను మాటలకంటే అత్యధికముగా "క్రీస్తు లో/క్రీస్తు నందు" అని రచించాడు. బాప్తిస్మము పొందుకొను సమయంలో క్రైస్తవులు ప్రవేశించు ఆధ్యాత్మిక ప్రపంచము "క్రీస్తు లో"/"క్రీస్తు నందు" అయియుండవలెను. క్రీస్తు "దేవుని యందు" ఉన్నందు వలన (యోహాను 10:38; 14:11, 20; 17:21); ఇదే పరిస్థితిని "దేవుని లో"/"దేవుని యందు" అని వర్ణించుట వలన ఎటువంటి సమస్యయైనను ఎదురుపడదు; గనుక "క్రీస్తు లో"/"క్రీస్తు నందు" ఉన్నవారు, ఆధ్యాత్మిక భావనలో, దేవుని లో/యందు కూడ ఉన్నారు.

**"మనకు జీవమై యున్న క్రీస్తు" (3:4ఎ)**

3:1-4లో పౌలు ఒక సర్వనామమును వాడుటకు బదులుగా, **క్రీస్తు** అను బిరుదును నాలుగు పర్యాయములు ఉపయోగించాడు. ఇట్టి అసాధారణమైన పునరుక్తము వక్కాణింపును సూచించుటకు ఉద్దేశింపబడినది. కొలొస్సయుల జీవములు క్రీస్తుతో కూడ దాచబడియున్నందువలన, మహిమ యందు ఆయన ప్రత్యక్షమగునప్పుడు, వారు ఆయనతో కూడ ఉంటారని పౌలు చెప్పుచున్నాడు (4బి వచనము). ఈవిధంగా, పౌలు ప్రస్తుత కాలమందలి జీవమును భవిష్యత్ జీవముతో ముడిపెట్టాడు. ఇప్పుడు క్రీస్తుతో కూడ నున్నవారు (4ఎ వచనము) ఆయన తిరిగి వచ్చినప్పుడు వారు ఆయనతో కూడ నుండునట్లు సజీవులుగా చేయబడుదురు (4బి వచనము). గతించుచున్న ఈ లోకము అంతమైనప్పుడు ఆయన తిరిగి వచ్చిన సమయంలో వారు మహిమపర్చబడిన యేసుతో కూడ నుందురు. యేసు యొక్క రెండవ రాకడకు సంబంధించనంత వరకు 4బి వచనము మాత్రమే కొలొస్సీ పత్రికలోని ఒకే ప్రసక్తియై యున్నది.

**క్రీస్తు మనకు జీవమై యున్నాడు:** అనగా మన జీవమునకు మూలాధారము, కేంద్రము, మరియు ఊరుచుండు ఊటయై యున్నాడు (1 యోహాను 5:12). గనుకనే, కొలొస్సయుల జీవములు క్రీస్తుతో కూడ దాచబడియున్నవని చెప్పుటకు అది మరొక కారణమై యున్నది.[8] ఆయన నుండి పొందుకొనబడునది మరియు ఆయనతో కూడ పంచుకొనబడునది జీవము మాత్రమే కాదు, కానీ క్రైస్తవునికి ఆయనే జీవమై యున్నాడు. యేసు ద్రాక్షావల్లియై యున్నాడు, క్రైస్తవులు తీగెలై యున్నారు (యోహాను 15:5). తీగెలు ద్రాక్షావల్లితో సంబంధము కలిగియున్నందువలన వాటిలో జీవమున్నది. యేసులో నిలిచియుండని ప్రతి తీగె తొలగింపబడును గనుక అది ఎండిపోవును. ఆ తరువాత, దానిలో యిక జీవము లేదు గనుక, అది కాల్చివేయబడును (యోహాను 15:6).

"జీవము"నకు విశేషణ గుణమును కలిగించు గ్రీకు పదము "మన యొక్క" లేక "మీ యొక్క" అయియుండవచ్చును. "మన యొక్క," *hēmon*, ఈ క్రింది అనువాదములలోని వాక్యభాగము లేదా మార్జిన్‌లో నున్న నోట్స్‌లో అగుపించుచున్నది: KJV, ASV, RSV, NAB, NEB, NKJV, మరియు NRSV. భిన్నమైన పదము *humōn* ("మీ యొక్క") అను పదము చెప్పుకోదగినన్ని చేతి వ్రాత ప్రతులలో ఇవ్వబడి యున్నది. అది గ్రీకు బాషలో నున్న క్రొత్తనిబంధన అవలంబించు ఉపలక్షణమై యున్నది. "మీ యొక్క" అను పదము NIV, NRSV, మరియు TEVలో మాత్రమే గాక, ASVలోని మార్జిన్‌లో ఇవ్వబడిన నోట్స్‌లో కూడ కనిపించును. మూల గ్రంథమందలి నిదర్శనము "మన యొక్క" లేక "మీ యొక్క" అను ఈ రెండు వచనములలో ఏది అసలైనదో/ఆధారభూతమైనదో కచ్చితంగా చెప్పుట అసాధ్యమగుచున్నది. ఎంత తర్జనభర్జన పడినా చివరకు, చెప్పుకోదగినంత తేడా ఏమి కనిపించదు. పౌలు "మన యొక్క" అను వచనమును వాడియున్నట్లయితే, క్రీస్తును వారి జీవముగా కలిగియున్నవారిలో ఆయన తననుతాను కూడ కలుపుకొనుచుండెను. ఆయన 2:13లను గలతీయులకు 3:25, 26లోను "మీకు" నుండి "మనకు" అను స్థిరత్వమును ఉపయోగించుచున్నాడు, గనుక పౌలుకు ఇది అసాధారణమైన అంశమేమీకాదని చెప్పుటకు ఇదొక సూచనయై యున్నది.

**“క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు, మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచబడుదురు” (3:4బి)**

క్రీస్తు, మహిమలో ప్రత్యక్షపరచబడినప్పుడు వారు కూడ ఆయనతో మహిమలో ప్రత్యక్షపరచబడుదురని పట్టణస్థులైన క్రైస్తవులకు పౌలు తెలియజెప్పాడు. యేసు క్రీస్తు రెండవ రాకడను (1 పేతురు 5:4; 1 యోహాను 2:28; 3:2), ఆయన ప్రత్యక్షమగుటను (మార్కు 16:12, 14), మరియు తెలియబడని దానిని బయలుపర్చుటకే బయలుపర్చబడవలసిన దానిని బయలుపర్చుటను (మార్కు 4:22; యోహాను 1:31) సూచిస్తూ *phaneroō* అను గ్రీకు పదము వాడబడినది. దేవుడు గత కాలములందు దాచియుంచినవి కానీ క్రొత్త నిబంధన కాలమందు ప్రత్యక్షపరచబడిన వీటికి కూడ ఈ పదము వాడబడినది (కొలొస్సయులకు 1:26).

యేసుతో కూడ నున్న వర్తమాన సంబంధము మరియు భవిష్యత్తులో ఉండనైయున్న సంబంధము సందర్భములో సహితము పౌలు ‘ఆయనతో కూడ’ అను పదజాలమును వాడుచున్నాడు. క్రైస్తవుని ప్రస్తుత జీవము పరలోకంలో కొనసాగుచు (ఫిలిప్పీయులకు 1:23; 1 థెస్సలొనీకయులకు 4:17) ఉండును. క్రైస్తవులు “క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల, క్రీస్తుతోడి వారసులై యున్నారని” పౌలు రచించాడు (రోమీయులకు 8:17బి). క్రీస్తుతో కూడ నుండుట యను విషయము ప్రస్తావింపబడుచున్న సందర్భములోని మిశ్రమ క్రియాపదములో “తో” (*sun*) వాడబడినప్పుడు, బాప్తిస్మము ద్వారా నూతన జీవమును పంచుకొనుట యను అర్థమై యున్నది (రోమీయులకు 6:4, 5; కొలొస్సయులకు 2:12, 13; 3:1).

కొలొస్సయులు ఈ క్రింది విషయములను యేసుతో కూడ పంచుకొన్నారు లేదా భవిష్యత్తులో పంచుకొందురు:

- వారు ఆయనతో కూడ పాతిపెట్టబడి, మరలా లేపబడి, సజీవులుగా చేయబడిరి (2:12, 13; 3:1).
- వారు లోకము యొక్క మూల పాఠములకు ఆయనతో కూడ మృతిపొందిరి (2:20).
- తత్ఫలితంగా, వారు దేవుని యందు క్రీస్తుతో కూడ దాచబడియున్నారు (3:3).
- వారు ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచబడుదురు (3:4).

ఇదే విధమైన ఆలోచనా పరంపరను పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో ఉపయోగించాడు. రోమా క్రైస్తవులు, బాప్తిస్మము, ఆయనతో కూడ పాతిపెట్టబడి, ఆయన మరణములో ఆయనతో కూడ ఏకమై, ఆయనతో కూడ సిలువ వేయబడిరి. ఈ విధంగా వారు ఆయనతో కూడ మృతిపొందినవారై, వారు ఆయనతో కూడ జీవించుదురని నిరీక్షణ కలిగియుండిరి (6:4–8).

“ఆయనతో కూడ” అను మాటలకు మరొక చోట కూడ అదే అర్థముండవలెనని పౌలు ఉద్దేశించాడు: “… ప్రభువైన యేసును లేపినవాడు యేసుతో మమ్మును కూడ లేపి, మీతో కూడ తన యెడల నిలువబెట్టును …” (2 కొరింథీయులకు 4:14; రోమీయులకు 8:32 చూడుము). దేవుడు, మృతులలో నుండి ఆయన లేపిన, యేసుతో పాటుగా, మనలను

సహితము లేపును. 1 థెస్సలొనీకయులకు 4:14లో అపొస్తలుడు ఇలా రచించాడు, "యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసు నందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును." ఈ వచనమును గూర్చి, జే. డబ్ల్యు. మెక్‌గార్వే ఇలా వ్యాఖ్యానించాడు,

> ఇచ్చట నున్న "ఆయనతో కూడ" అను మాటలకు యేసు పరలోకములోనుండి శరీరములులేని ఆత్మలను పునరుత్థానమునకు తెచ్చునని అర్థము కాదు, కానీ సమాధిలో నుండి యేసును తెచ్చిన దేవుడు, యేసుతో పాటు సముచ్ఛయముగా, దాని లోనికి వారి జీవములు యేసుతో ఐక్యమై ప్రవేశించిన వారినందరిని కూడా సమాధిలో నుండి తెచ్చును.[9]

సమాధిలో నుండు వారందరు, మంచివారు మరియు చెడ్డవారు సహితము, అదే సమయంలో లేపబడుదురు (యోహాను 5:28). ఇది అంత్యదినమున జరుగును (యోహాను 6:39, 40, 44, 54), ఆ సమయంలో అందరికిని తీర్పు తీర్చబడును (యోహాను 12:48).[10] సూర్యుడు ప్రకాశించుచున్నంత వరకు, భూమి తన అక్షము చుట్టు తిరుగుచు సూర్యుని చుట్టు ప్రదక్షిణము చేయుచున్నంత వరకు, దినములు కొనసాగుచునే యుండును. యేసు తిరిగి వచ్చినప్పుడు, విశ్వమంతయు గతించిపోవును గనుక అప్పుడు దినములు యిక ఉండవు. పునరుత్థానము, విశాల విశ్వము నిలిచియుండు "అంత్య దినమున" జరుగును. తీర్పు తీర్చబడుటకు మృతులు లేపబడిన తరువాత, భూమ్యాకాశములు గతించిపోవును (2 పేతురు 3:10; ప్రకటన 20:11).

వారు యేసు చేత లేపబడుదురనియు, ఆయన తిరిగి వచ్చినప్పుడు వారు ఆయనతో కూడ ఆయన మహిమలో పాలు పంచుకొందురనియు కొలొస్సయులు ఎదురుచూడవచ్చును. యోహాను ఇలా వ్రాయుచున్నాడు, "మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు. గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు, ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని ఎరుగుదుము" (1 యోహాను 3:2బి). యేసు "మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును" అని పౌలు వ్రాయుచున్నాడు (ఫిలిప్పీయులకు 3:21ఎ).

మరణము తరువాత పుడమిపై నిలిచియుండును, ఆత్మ పాతాళమునకు వెళ్లును (ఆదికాండము 35:18; అపొస్తలుల కార్యములు 2:27, 31). యేసు తిరిగి వచ్చునప్పుడు, మృతిచెందిన వారందరి శరీరములను ఆయన లేపి (యోహాను 5:28, 29) మార్పునొందిన శరీరములను, ఆ సమయంలో పాతాళము వదిలిపెట్టు వాటి ఆత్మలతో ఐక్యపరచును (ప్రకటన 20;11-13). అటుతరువాత, యేసు తన సింహాసనము మీద ఆసీనుడగును, అప్పుడు ప్రస్తుత విశ్వమంతయు అంతమగును (2 పేతురు 3:10; ప్రకటన 20:11). దీని తరువాత, యేసు సకల మానవాళికి – పునరుత్థానులైనవారికిని, యింకను సజీవులుగా ఉన్నవారికిని – తీర్పు తీర్చును.[11] అప్పుడు, యేసు ఆయన తన తండ్రికి తిరిగి రాజ్యమును అప్పగించును (1 కొరింథీయులకు 15:24-27).

"మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచబడుదురు" అని ప్రకటన క్రీస్తు నందు నూతన జీవముగలవారై జీవించుటకు వారు పడిన ప్రయాసమునకు బహుమానముగా వారు ఆయనతో కూడ మహిమలో ప్రత్యక్షపరచబడుదురని కొలొస్సయులకు ప్రశాంతకరమైన

అభయమును కలిగించియుండును. వారు ఆయనతో మహిమలో ప్రత్యక్షపరచబడుదురను అభయము, జీవితములో ఎదురయ్యే ఆధ్యాత్మిక ఆపదల నుండి వారు యేసుతో కూడ దాచబడియుండుటపై ఆధారపడియుంటుంది. వారు పుడమిపై పురజనులు కాదు గాని పరదేశస్థులై యుండిరి; కానీ వారి ఆధ్యాత్మిక స్వదేశములో, అనగా వారి పౌర స్థితి గల పరలోకములో, వారు యేసుతో కూడ నుందురు (ఫిలిప్పీయులకు 3:20). వారి శరీరములు యేసు యొక్క మహిమ శరరమునకు సమరూపముగలవిగా మార్చబడును. వారు, రక్షింపబడినవారందరితో కూడ, క్షయమగునవియు, ఐహికమైనవియునైన శరీరముల నుండి విడిపింపబడి అక్షయమగునవియు ఆధ్యాత్మికమునైన శరీరములు అనుగ్రహింపబడుదురు (1 కొరింథీయులకు 15:42, 43; 2 కొరింథీయులకు 5:1, 2 చూడుము).

## అన్వయము

**క్రీస్తుతో కూడ లేపబడినవారు నూతన మార్గనిర్దేశనము కలిగియుందురు (3:1, 2)**

కొలొస్సయులు బాప్తిస్మమందు క్రీస్తుతో కూడ లేపబడిరి (1ఎ వచనము; 2:12). ఏదిఏమైనా, ఆయనతో కూడ లేపబడుట తక్షణ సంపూర్ణతను సమకూర్చదు. క్రైస్తవ శీలము పెంపొందింపజేసికొనుటకు సహనముతో కూడిన ప్రయాసము అవసరమై యున్నది. ఇందు నిమిత్తమై జీవితము యెడల యేసు కలిగియండిన పరలోక దృష్టికోణముపై మన మనస్సును కేంద్రీకరించవలసి యుండును. నూతనముగా జన్మించిన క్రైస్తవులు, బాప్తిస్మమందలి ఆధ్యాత్మిక జన్మతో వారి జీవితములు మొదలగు శిశువులను పోలియున్నారు (యోహాను 3:3-5). వారు ఆధ్యాత్మికముగా అభివృద్ధిచెందుటకు వారికి దేవుని వాక్యము అవసరమై యున్నది (1 పేతురు 2:2).

క్రైస్తవులు వారి దృష్టినంతటిని క్రీస్తు నివసించు ప్రదేశముపై కేంద్రీకరించవలెను (1బి, 2 వచనాలు). మన ప్రగాఢ వాంఛ లౌకిక విషయముల మీద కాదు గాని దేవుని విషయముల గూర్చినదై యుండవలెను (1 యోహాను 2:15-17). మనము ఐహిక ఆస్తులకే అతుక్కుపోయి యుండకూడదు. మన మనస్సులను పరలోక విషయములపై కేంద్రీకరించుట ద్వారా మనము దీనికి దూరముగా ఉండగలము. నావను నడిపించు నాయకుడు తన గమ్యస్థానమును ఎరిగియుండి చేరాల్సివున్న నౌకాశ్రయము దిశగా నావను నడిపించుటకు సారథ్యం వహించవలెను. ఆసక్తికరమైన అనేక మార్గాంతర మలుపులు చేర్చాల్సినది చేరకుండా ఆయన దృష్టిని ఆకర్షింపవచ్చును, కానీ తన ప్రయాణమును సుఖాంతంగా పూర్తి చేయునట్లు ఆయన తన నావను సరైన మార్గములోనే పోనిచ్చుచుండవలెను.

మనము పరలోక ప్రదేశములలోని విషయములనే వెదకుచుండవలెను. క్రైస్తవులముగా మన లక్ష్యము ఉన్నతమైనదై యున్నది: మనము సజీవులముగా ఉన్నంతకాలము, యెడతెరిపిలేకుండా మనము ప్రయత్నించినప్పటికిని, క్రీస్తు కలిగియున్న ప్రతి లక్షణమును అభివృద్ధిచేసికొనిన వారము కాకపోవచ్చును. మనము అనుదినము అన్ని విషయములలోను అంతకంతకు క్రీస్తును పోలినవారమగునట్లు యెడతెరపిలేని సవాళ్లను ఎదురు తెచ్చుటయే క్రైస్తవ జీవితములో గల శోభయై యున్నది.

క్రైస్తవులు ఎన్నటికినీ క్రీస్తు సంపూర్ణత లోనికి సంపూర్తిగా ఎదుగలేరు; పరిపూర్ణత ఎన్నటికిని సాధించబడనేరదు కానీ యేసు అనుచరుల లక్ష్యము అదే అయియుండవలెను. "హై జంప్" పోటీల్లో పాల్గొనువాడు, అతని శక్తికి మించిన ఎత్తునుండి దూకవలెనను ప్రయత్నముతో అడ్డు కమ్మీ ఎత్తును కొంచెము కొంచెము పెంచుచుండును, క్రీస్తు నిమిత్తము ఆయనతో సమరూపముగలవాడై యుండుటకు పౌలు సహితము ఇలాగే ప్రయత్నించాడు (ఫిలిప్పీయులకు 3:12-14).

క్రైస్తవులు అనుకరించాల్సిన మాదిరి, క్రీస్తు (1 కొరింథీయులకు 11:1; 1 యోహాను 2:6). ఒక రూపచిత్రమును గీసి దానికి రంగులు వేయుటలో, చిత్రకారుడు సర్వసాధారణంగా ఒక చక్కని సవిస్తరమైన చిత్రమును తయారుచేయుటకు ప్రయత్నిస్తుంటాడు. ఈ విధంగా ఒక సంతృప్తినిచ్చు చిత్రమును గీయాలంటే, అతడు చిత్రీకరించు వ్యక్తిని గాని వస్తువును గాని పదేపదే పలుమార్లు చూస్తూ అతి జాగ్రత్తతో చిత్రీకరిస్తూ, ఆ వ్యక్తికి/వస్తువుకు సరిగ్గా సరిపడు పోలికను తయారు చేయుటకు ప్రయత్నించాల్సివుంటుంది. యేసు క్రీస్తు యొక్క ఆధ్యాత్మిక లక్షణాలను అనుకరించగోరు క్రైస్తవులు సహితము చేయాల్సింది ఇదే (ఎఫెసీయులకు 4:13).

## క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడియున్న జీవము (3:3)

వారు పాపము విషయమై చచ్చినవారై యున్నారని వారి సొంత ఆధ్యాత్మిక మరణమునకు గురుతైయుండి, పాపములేని నూతన జీవముగా పరిణమించిన క్రీస్తు మరణము లోనికి, బాప్తిస్మము పొందియున్నారని పౌలు రోమా పట్టణ క్రైస్తవులకు తెలియజెప్పాడు (రోమీయులకు 6:3, 4, 17, 18). బాప్తిస్మము పొందిన సమయంలో, గతించిన జీవితము ముగిసిపోయి క్రీస్తు నిమిత్తమై ఒక నూతన జీవము మొదలౌతుంది (3ఎ వచనము). ఎన్నడును స్నానము చేయని ఒకని గూర్చి ఊహించుకొనుచు, ఈ అన్వయమును వర్తింపజేయండి: ఒక్క ఆధ్యాత్మిక స్నానము చేయుట ద్వారా, గతములోని మురికంతా లేక పాపమంతా, తీసివేయబడుతుంది.

దేవుని యందు క్రీస్తులో గల *మరుగు* క్రైస్తవులకు ఆశ్రయమై యున్నది. మనము ఆయనయందు ఆశ్రయము పొందినట్లయితే, లోకము మనలను కనుగొనజాలదు లేక దాని చెడు అభ్యాసములలో మనలను చేజిక్కించుకొనజాలదు. మనము క్రీస్తుతో కూడ దేవుని యందు నిలిచియున్నంత వరకు దాని మరులుగొల్పు మార్గముల నుండి మనము దాచబడియుందుము (3బి వచనము).

## క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు మనము మహిమపరచబడుదుము (3:4)

ప్రస్తుత లోకము క్రైస్తవులను మహిమపరచబడిన స్థితిలో చూడదు, ఏలయనగా మనము భవిష్యత్తుతో పొందనైయున్న మహిమను యింకను పొందలేదు. లోకమునకు మనము దాచబడియున్నాము అనగా, లోకము దేవుని కుమారులను గుర్తింపజాలదు (1 యోహాను 3:1). మనలను మహిమలోనికి తీసికొని వెళ్లుటకు క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, మనమికను దాచబడియుండము కానీ, ఆయనతో కూడ బయలుపరచబడుదుము, ఆయనను పోలియుందుము (4వ వచనము; ఫిలిప్పీయులకు 3:21; 1 యోహాను 3:2).

క్షయమగునదియు, తాత్కాలికమైనదియునైన ఈ లోకము అంతమైప్పుడు, మహిమను

పొందవలెనునదే క్రైస్తవుల అంతిమ లక్ష్యమై యున్నది (2 కొరింథీయులకు 4:18). మనము "అంతకంతకు ఎక్కువైనదైయున్న నిత్యమైన మహిమ భారమును" పొందినప్పుడు మన సమస్త పోరాటములు మరియు పరీక్షలు యోగ్యమైనవై యుండును (2 కొరింథీయులకు 4:17).

---

సూచనలు

[1]రోమీయులకు 12:1; 1 కొరింథీయులకు 15:58; 2 కొరింథీయులకు 5:17; గలతీయులకు 5:1; ఎఫెసీయులకు 4:1; ఫిలిప్పీయులకు 4:1 కూడ చూడుము. [2]J. B. Lightfoot, *St. Paul's Epistles to the Colossians and to Philemon,* rev. (London: Macmillan & Co., 1916), 207. [3]Robert G. Bratcher and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letters to the Colossians and to Philemon,* Helps for Translators (New York: United Bible Societies, 1977), 74. [4]అపొస్తలుల కార్యములు 2:34; 5:31; 7:55; రోమీయులకు 8:34; ఎఫెసీయులకు 1:20; హెబ్రీయులకు 1:3; 8:1; 10:12; 12:2; 1 పేతురు 3:21; 22 చూడుము. [5]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 1065. [6]మత్తయి 10:30; మార్కు 8:17; లూకా 6:22, 38; యోహాను 14:1; యాకోబు 4:14 చూడుము. [7]William Hendriksen, *Exposition of Colossians and Philemon*, New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1964), 141. [8]యోహాను 11:25; 14:6; 20:31; 2 కొరింథీయులకు 4:10–12; 2 తిమోతి 1:1 చూడుము. [9]J. W. McGarvey and Philip Y. Pendleton, *Commentary on Thessalonians, Corinthians, Galatians and Romans* (Cincinnati: Standard Publishing Foundation, n.d.), 20. [10]మత్తయి 25:31, 32; 2 కొరింథీయులకు 5:10; ప్రకటన 20:11, 12 కూడ చూడుము.

[11]మత్తయి 25:31–46; యోహాను 5:22; అపొస్తలుల కార్యములు 10:42; 17:31; 2 కొరింథీయులకు 5:10; 2 తిమోతి 4:1.